సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
98490 98674
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

నేత్ర వైద్య శిబిరానికి స్పందన


రోగికి కంటి వైద్య పరీక్ష చేస్తున్న వైద్యులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డులోని అశోక్‌నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద బెస్ట్ విజన్ కంటి ఆస్పత్రి డాక్టర్ పావని సహకారంతో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇటువంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యులు కంటి పరీక్షలు చేసి, రోగులకు ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మద్దాల అప్పారావు, లోకనాధం, నాగిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ సమావేశం రేపు

అగనంపూడి: పీఆర్‌టీయూ పరవాడ మండల కమిటీ సమావేశం శనివారం సాయంత్రం నాలుగు గంటలకు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్టు అనకాపల్లి జిల్లా పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి సీహెచ్. పెద్దినాయుడు తెలిపారు. ఈ సమావేశంలో మండల స్థాయిలో ఉపాధ్యాయ సమస్యలపై చర్చించడంతో పాటు మండల కొత్త కమిటీ ఏర్పాటు చేయనున్నట్టు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ పాల్గొంటారని తెలిపారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీల ట్రోఫీల ఆవిష్కరణ


ట్రోఫీలను ఆవిష్కరిస్తున్న కరణంరెడ్డి

గాజువాక: కల్చర్ ఫౌండేషన్, ట్రెస్, రైస్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించనున్న కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్ పోటీల ట్రోఫీలు, పోస్టర్లను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి 29 వరకు గాజువాక హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ఈ పోటీలకు జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి వెయ్యి మంది క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు. క్రీడాభిమానులు, క్రీడాకారులు ఈ పోటీలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్టుల ప్రతినిధులు, నిర్వాహకులు దాస్, పేర్ల అప్పారావు, శేఖర్, శివ, తాతారావు, గిరిధర్ నాయుడు, రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

తుప్పల తొలగింపు


తుప్పలను తొలగిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు పెదపాలెం వంతెనకు వెళ్లే రహదారిలో తుప్పలను గురువారం తొలగించారు. ఈ ప్రాంతంలో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు ఏపుగా పెరిగిపోవడంతో కాలనీ ప్రజలు, అటుగా రాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడేవారు. సమస్య తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ 77వ వార్డు మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎస్.కె.నన్నా, జీవీఎంసీ అధికారులతో మాట్లాడారు. దీంతో సిబ్బంది గురువారం తుప్పలను తొలగించారు. కార్యక్రమంలో ఇస్మాయిల్, అజారుద్దీన్, జబర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష కుంకుమార్చన

సింహాచలం: సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 7 నుంచి 9గంటల వరకు సింహవల్లీ తాయారు అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 5.30 గంటలకు అమ్మవారికి సహస్ర నామార్చన నిర్వహించనున్నారు.



వడివడిగా.. అభివృద్ధి దిశగా..

- దువ్వాడ స్టేషన్ అడుగులు
- శిథిల షెల్టర్ నుంచి అత్యాధునిక వసతుల వైపు పరుగులు
- 'అమృత్ భారత్'తో మహర్దశ


ఎత్తు, విస్తరణ పనుల అనంతరం ప్లాట్‌ఫామ్


శిథిలమైన పెంకుటింటిలో 1903 నాటి దువ్వాడ రైల్వేస్టేషన్ (నాడు)



ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్ ముఖద్వారం, భవనం (నేడు)

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ దశ తిరిగింది. శిథిల షెల్టర్ నుంచి అత్యాధునిక స్టేషన్‌గా రూపాంతరం చెందుతోంది. అధునాతన వసతులు, వీఐపీ లాంజ్‌లు, కమర్షియల్ హాబ్‌లతో వెలిగిపోనుంది. అమృత్ భారత్ స్టేషన్‌లో దువ్వాడ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ, అప్‌గ్రెడేషన్‌లో భాగంగా రూ.26.31 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చిన్న పెంకుటింటితో ప్రారంభమై..

1903లో దువ్వాడ రైల్వేస్టేషన్ ఏర్పాటు చేశారు. అప్పట్లో శిథిలావస్థలో ఉన్న ఓ పెంకుటింటిలో నిర్వహణ ప్రారంభించారు. తరువాత రేకుల షెడ్‌ను నిర్మించారు. అనంతరం దాదాపు 90 సంవత్సరాల పాటు కేవలం పాసింజర్ రైళ్లకు మాత్రమే పరిమితమైన దువ్వాడ రైల్వేస్టేషన్ ఎదుగూ బొదుగూ లేకుండా మిగిలిపోయింది. అవే వసతులు.. అవే పాసింజర్ రైళ్లు.. గూడ్స్ రైలు బండిలా... అభివృద్ధి నత్తనడకన సాగింది.

1995 నుంచి అభివృద్ధి పరుగులు

1995 నుంచి అభివృద్ధి పరుగులు పెట్టింది. స్టీల్‌ప్లాంట్, విశాఖ రిఫైనరీ, ఎన్టీపీసీ, డాక్‌యార్డ్, బీహెచ్‌పీవీ, ఎస్ఈజెడ్, ఫార్మా కంపెనీలు.. వాటి అనుబంధ సంస్థల పారిశ్రామిక వాడలతో గాజువాక శరవేగంగా అభివృద్ధి చెందింది. వందలాది పరిశ్రమలు పుట్టుకు రావడంతో దేశం నలుమూలల నుంచి ఈ ప్రాంతంలో స్థిరపడే వారు రెట్టింపు కావడంతో దువ్వాడ రైల్వేస్టేషన్‌కు ప్రాచుర్యం మొదలైంది.

తూర్పు కోస్తా రైల్వే జోన్‌లో విలీనం

1986 వరకు దక్షిణ మధ్య రైల్వేలో ఉన్న వాల్తేరు డివిజన్ జోన్ల పునర్విభజన వల్ల తూర్పు రైల్వేలో విలీనమైంది. తరువాత పదేళ్లకు 1996లో తూర్పు కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేసి వాల్తేరు డివిజన్‌ను విలీనం చేయడంతో రైల్వేస్టేషన్‌లో మౌలిక వసతులు, అభివృద్ధి పనులు కల్పిస్తూ వస్తున్నారు. అదే సమయంలో ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్ వైపు పరిపాలనా భవనం, ముఖ ద్వారం నిర్మించారు.

అసోసియేషన్ వినతులు

దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి ప్రయాణం చేసే ప్రయాణికులు సంఖ్య రెట్టింపు కావడంతో వసతులు పెంచాలని రైల్వే యూజర్స్ అసోసియేషన్ వినతి పత్రాలు సమర్పించారు. తరువాత కాలంలో ట్విట్టర్, వాట్సాప్, ఫేస్‌బుక్‌ల ద్వారా దువ్వాడ రైల్వేస్టేషన్ సమస్యలు ఏకరువు పెట్టడం, పాలకుల దృష్టికి తీసుకువెళ్లారు.

- 2004 నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేస్తున్నారు. ప్రస్తుతం 50 జతల రైళ్లు, స్పెషల్ రైళ్లకు ఇక్కడ హాల్ట్ ఇస్తున్నారు.
- 2004లో ఒకటి, రెండు, మూడు ప్లాట్‌ఫామ్‌ల వైపు ఫుట్ ఓవర్ వంతెన నిర్మించారు. అదే ఏడాది మూడు ప్లాట్‌ఫామ్‌లను ఉత్తర, దక్షిణ దిశల్లో విస్తరించారు.
- 2012లో డీ గ్రేడ్‌లో ఉన్న రైల్వేస్టేషన్ బీ గ్రేడ్‌కు అప్‌గ్రేడ్ చేశారు. అదే ఏడాది రైల్వే బడ్జెట్‌లో దువ్వాడ రైల్వేస్టేషన్‌ను ఆదర్శ రైల్వే స్టేషన్‌గా అభివృద్ధి చేయడానికి ప్రకటించారు. ఆ క్రమంలో నాలుగో నంబర్ ప్లాట్‌ఫాం ఏర్పాటును విస్తరించడం, రెండో ఫుట్ ఓవర్ వంతెన నిర్మించడం జరిగింది. నాలుగో నంబర్ ప్లాట్‌ఫామ్ వైపు ముఖద్వారం నిర్మాణ పనులు ప్రారంభించారు.
- 2023లో భారత ప్రభుత్వం అమృత్ భారత్ కార్యక్రమంలో దువ్వాడ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధికి శ్రీకారం చుట్టడంతో సమస్యల పరిష్కారం మొదలుకొని అధునాతన వసతుల కల్పన వైపు అడుగులు పడుతుండడంతో పారిశ్రామిక ప్రాంతం ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


1985లో స్టేషన్‌లో ఎండలో కూర్చున్న ప్రయాణికులు (నాడు)


నాలుగో నంబర్ ప్లాట్‌ఫామ్‌లో అత్యాధునిక వసతులు (నేడు)

మార్కెట్లకు శ్రావణ శోభ


కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న గాజువాక మార్కెట్

కిటకిటలాడిన కొత్త గాజువాక

గాజువాక: గాజువాక మార్కెట్లు శ్రావణశోభను సంతరించుకున్నాయి. కొనుగోలుదారులతో దుకాణాలన్నీ గురువారం కళకళలాడాయి. కొనుగోలుదారుల తాకిడితో మెయిన్ రోడ్డు, బీసీ రోడ్ రద్దీగా మారాయి. వరలక్ష్మీ వ్రతానికి అవసరమైన లక్ష్మీకాసులు, జాతిరాళ్ల ఆభరణాలు, పచ్చలు, కెంపులు, మగువలు మెచ్చే రీతిలో అందుబాటులో ఉంచడంతో పాటు ఆఫర్లను ప్రకటించడంతో బంగారం దుకాణాలు కొనుగోలుదారులతో నిండుగా కనిపించాయి.వినియోగదారుల అభిరుచులకనుగుణంగా వస్త్ర వ్యాపారులు వివిధ మోడళ్ల వస్త్రాలను తీసుకొచ్చి ప్రత్యేక రాయితీలతో విక్రయించడంతో షోరూమ్‌లు రద్దీగా మారాయి.

ధరల మోత

ఒక్క కొబ్బరికాయ ధర రూ.40, గుప్పెడు మామిడాకుల ధర రూ.20.. రెండు పుష్పాలు రూ.25, డజను అరటిపళ్లు (చిన్న సైజు) రూ.80కి పైమాటే. ఇక మిగిలిన సామగ్రి ధరల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పుష్పాల ధర కేజీపై ఒక్కసారిగా రూ.200 పెంచి విక్రయించారు. ధరలన్నీ ఆకాశాన్నంటడంతో కొనుగోలుదారులు పెదవి విరిచారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఎంత ధరైనా చెల్లించి కొనుగోలు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు.


దుకాణాల వద్ద రద్దీ

68వ వార్డులో..

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు పరిధి అక్కిరెడ్డిపాలెం, షీలానగర్, నాతయ్యపాలెం, బీహెచ్‌పీవీ సిగ్నల్ పాయింట్ తదితర ప్రాంతాలు గురువారం సాయంత్రం రద్దీగా మారాయి. వరలక్ష్మీ వ్రతానికి పూజా సామగ్రి కొనుగోలు చేయడానికి వచ్చిన వారితో సందడి నెలకొంది.


అక్కిరెడ్డిపాలెం సర్వీసు రోడ్డు పక్కన పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు

రైస్ కార్డుల కోసం విశ్రాంత ఉద్యోగుల వినతి


ఎమ్మెల్యే నాగిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

గాజువాక: వివిధ సంస్థల్లో ఉద్యోగం చేసి, రిటైరై అతి తక్కువ పెన్షన్ పొందుతున్న తమకు ప్రభుత్వం జారీ చేసే రైస్ కార్డులను ఇప్పించాలని పలువురు విశ్రాంత ఉద్యోగులు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని కోరారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వారు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెదగంట్యాడ, గంగవరం, వడ్లపూడి, కూర్మన్నపాలెం, అగనంపూడితో పాటు గాజువాక పరిధిలోని అనేక ప్రాంతాల్లో స్టీల్ ప్లాంట్ నిర్వాసితులు, ఉద్యోగాలు చేసిన రిటైరైన వారు ఉన్నారని పేర్కొన్నారు. రిటైరైన ఉద్యోగులకు కేవలం రూ.2 వేల నుంచి రూ.3 వేల పెన్షన్ వస్తోందని తెలిపారు. తమ జీవనానికి ఈ డబ్బులు సరిపోక చాలా ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. పెన్షనర్లలో అర్హులకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసే రైస్ కార్డును ఇప్పిస్తే కొంత ఉపశమనం కలుగుతుందని కోరారు. ఈ విషయంపై ఇప్పటికే తాము స్పందన ద్వారా సంబంధిత కార్యాలయాలకు దరఖాస్తు చేశామని, అయినా న్యాయం జరగడం లేదని పేర్కొన్నారు. దీనిపై స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు పిట్ట గురునాథరావు, కణితి అప్పలరాజు, ఎం.వెంకటరావు, జె.సన్యాసిరావు, జి.అప్పారావు, పి.చంద్రయ్య తదితరులున్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన


కల్యాణ మండపం పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు దుర్గవానిపాలెం ఎస్సీ కాలనీలో రూ.50 లక్షలతో నిర్మించనున్న మినీ కల్యాణ మండపం పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ వార్డుకు నిధులు కేటాయించి, అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. ఇప్పటికే అన్ని వార్డుల్లో రోడ్లు, కాలువలు నిర్మించామన్నారు. భవిష్యత్తులో మరిన్ని పనులు చేపట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పులి లక్ష్మీబాయ్, దుర్గవాని పాలెం గ్రామ అధ్యక్షుడు గంట్యాడ గురుమూర్తి, మార్టుపూడి పరదేశి, వార్డు అధ్యక్షుడు గొందేశి శ్రీనివాసరెడ్డి, కొయ్య భారతి తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రగతిలో ప్రభుత్వరంగ సంస్థలు కీలకం

- చంద్రయాన్–3లోనూ భాగస్వామ్యం
- అందుకే అంత తక్కువ వ్యయంతో విజయం
- అటువంటి సంస్థల నిర్వీర్యం సరికాదు
- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న రామస్వామి

కూర్మన్నపాలెం: దేశ ప్రగతిలో ప్రభుత్వరంగ సంస్థలు కీలక భాగస్వామ్యం పోషిస్తున్నాయని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఇస్రో ప్రతిష్ఠాత్మకంగా ప్రయోగించిన చంద్రయాన్-3లోను ప్రభుత్వరంగ సంస్థల భాగస్వామ్యం ఉందని, అందుకే తక్కువ వ్యయంతో ఇంతటి విజయం సాధ్యమైందని అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో గురువారం 924వ రోజు విశాఖ స్టీల్‌ప్లాంట్ ఓబీసీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయాలనుకోవడం సరికాదన్నారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో అనేక మంది ప్రధాన మంత్రులు ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేసి పేద, బలహీనవర్గాల ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచారని, కానీ నేటి పాలకులు ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ పేదప్రజల జీవితాలను సర్వనాశనం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం


హైమాస్ట్ లైట్లు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వరలక్ష్మి

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి ఆర్‌హెచ్‌సీ కొండయ్యవలస సీఎస్‌ఆర్ పార్క్, నిర్వాసిత కాలనీ దిబ్బపాలెం రామాలయం వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ దీపాలను కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వార్డులో వీధి దీపాల నిర్వహణకు కొత్త కాంట్రాక్టర్‌ను ఏర్పాటు చేయడం ద్వారా వీధి దీపాల సమస్య పరిష్కారం కాగలదన్నారు. వార్డులో ప్రధాన సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సహకారంతో కృషి చేస్తున్నానన్నారు. అనంతరం సీఎస్ఆర్ పార్కులో ఏర్పాటు చేసిన రచ్చబండను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు బలిరెడ్డి శ్రీను, ఐఈఆర్ సీహెచ్.అప్పారావు విందుల వరహాలు, వెంకటరమణ, సాయిన సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

జయహో.. ఇస్రో

శాస్త్రవేత్తలను అభినందిస్తూ విద్యార్థుల ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గాజువాక: చంద్రయాన్–3 విజయవంతం కావడంతో ఇస్రో శాస్త్రవేత్తలను అభినందిస్తూ స్థానిక ప్రియదర్శిని హైస్కూల్ విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. రామచంద్రనగర్‌లోని పాఠశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ గోపాలరెడ్డినగర్ జంక్షన్ వరకు కొనసాగింది. ర్యాలీ అనంతరం విద్యార్థులకు చంద్రయాన్–3 విశిష్టతలపై క్విజ్ పోటీ నిర్వహించారు.

ఉక్కు అభివృద్ధిలో ఉద్యోగుల సేవలు ఎనలేనివి


క్యూఏటీడీ ఉద్యోగి సత్యారావుకు జ్ఞాపిక అందజేస్తున్న విభాగం జీఎం రుచిరా గుప్తా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అభివృద్ధిలో ఉద్యోగుల సేవలు ఎనలేనివని స్టీల్‌ప్లాంట్ క్వాలిటీ ఎస్యూరెన్స్ అండ్ టెక్నలాజికల్ డెవలప్‌మెంట్ (క్యూ.ఎ.టి.డి) విభాగం జనరల్ మేనేజర్ రుచిరా గుప్తా అన్నారు. జనరల్ ఫోర్‌మన్ పేర్ల సత్యారావు క్యూఏటీడీ విభాగంలో 36 ఏళ్ల విధులు నిర్వహించి ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా విభాగం ఉద్యోగులు గురువారం ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జీఎం మాట్లాడుతూ హుద్‌హుద్ సమయంలో సత్యారావు తన ప్రతిభతో విభాగానికి ఎంతో కృషి చేశారన్నారు.కార్యక్రమంలో అధికారులు పి.అప్పారావు నాయుడు, పద్మ ప్రియ, శాంతమ్మ, మురళీధర్, ఆశ, యామినీ, శార్దక్, ముజేందర్, గీతాశ్రీ, కార్మిక నాయకులు నరేష్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, ఈటి శ్రీనివాసరావు, గంగవరం గోపి, కొవిరి కోదండరావు తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ఆధార్ అప్‌డేట్ శిబిరాలు

గాజువాక: ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకోవడం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలు శుక్రవారంతో ముగియనున్నాయి. ప్రతీ ఒక్కరు కనీసం పదేళ్లలో ఒక్కసారైనా తమ ఆధార్ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని కార్డుల జారీ సంస్థ యూఐడీఏ కొత్తగా నిబంధనలు తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. అలాగే కొంతమంది చిరునామాలు మారడం, మరికొంతమందికి తమ అవసరాల రీత్యా కార్డులను అప్‌డేట్ చేసుకోవాల్సిన పరిస్థితులు ఉంటాయి. ఇలాంటి మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకోవడానికి అవకాశం కల్పించింది. దీనికోసం ఈ నెల 22 నుంచి 25 వరకు నాలుగు రోజుల పాటు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసింది. గాజువాకలోని 17 సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాల్లో కార్డుల అప్‌డేట్ ప్రక్రియ జోరుగా కొనసాగుతోంది. ఒక్కో కేంద్రంలో రోజుకు సగటున 30 ఆధార్ కార్డులను అప్‌డేట్ చేస్తున్నట్టు సిబ్బంది తెలిపారు. ఇక శుక్రవారం ఒక్కరోజే అవకాశం ఉండటంతో అవసరమున్న వారంతా తమ కార్డులను అప్‌డేట్ చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

జాబ్‌మేళాలో 250 మందికి ఉపాధి


జాబ్ మేళాలో పాల్గొన్న అభ్యర్థులు

అగనంపూడి: అగనంపూడి సమీపంలోని గొన్నా ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాలో 250 మంది ఎంపికైనట్టు విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ గొన్నా హేమచంద్ నాయుడు తెలిపారు. గొన్నా విద్యా సంస్థల వ్యవస్థాపకుడు జీబీ నాయుడు జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాలో 20 కంపెనీలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా హేమచంద్‌నాయుడు మాట్లాడుతూ నిరుపేదలకు, స్థానికులకు ఉన్నత విద్యను అందుబాటులో ఉండాలనే సంకల్పంతో తమ తండ్రిగారైన జి.బి.నాయుడు గొన్నా విద్యాసంస్థలను ఏర్పాటు చేశారన్నారు. ఆయన ఆశయాన్ని నెరవేర్చేందుకు సంస్థ కృషి చేస్తోందన్నారు. ఎంపిక ప్రక్రియలో 12 వందల మంది నిరుద్యోగులు హాజరు కాగా 250 మందికి ఉద్యోగావకాశాలు దక్కాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీఎస్ఎస్ మూర్తి, ప్లేస్‌మెంట్ అధికారి ఓం నమశ్శివాయ, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై సర్వత్రా హర్షం


మహిళలకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న దేవన్‌రెడ్డి

కూర్మన్నపాలెం: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సుపరిపాలనపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి ఇస్తున్న ప్రాధాన్యం, అభివృద్ధికి చేపడుతున్న చర్యలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని తెలియజేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 86వ వార్డు కూర్మన్నపాలెం సచివాలయ పరిధిలోని శాతవాహననగర్, గౌరీనగర్, సాయిబాలాజీనగర్ ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి దామా సుబ్బారావుతో కలిసి ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, నాలుగేళ్లలో ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఏమైనా సమస్యలున్నా, అర్హులై ఉండి పథకాలు అందకపోయినా తెలియజేయాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా దేవన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో నాలుగేళ్లలో 95 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నామన్నారు. ప్రజల బాగోగుల కోసం నిరంతరం శ్రమించే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండి, ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వి.వి.ఎస్.ఎన్.రాజు, పార్టీ వార్డు అధ్యక్షుడు వెలుగుల పరశురాముడు, మాటూరి శ్రీనివాసరావు, చేగొండి శ్రీనివాసరావు, వాడపల్లి రామచంద్రరాజు, శ్రీనివాస పట్నాయక్, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్టు : గంజాయి స్వాధీనం

కూర్మన్నపాలెం: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడనే ముందస్తు సమాచారంతో ఓ వ్యక్తిని దువ్వాడ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించి దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి.. అగనంపూడి దరి బొర్రమాంబ కాలనీకి చెందిన ముప్పల మహేశ్వరరావు అగనంపూడి, స్టీల్‌ప్లాంట్ తదితర ప్రాంతాల్లో పేకాట నిర్వహిస్తున్నాడని, అక్రమంగా గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నాడని పోలీసులకు సమాచారం అందింది. దీంతో దువ్వాడ పోలీసులు బుధవారం రాత్రి మంగళపాలెం వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఆ సమయంలో అతని వద్ద ఉన్న 2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు మహేశ్వరరావును అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.





